నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ప్రాగాటూల్స్ సబ్‌స్టేషన్ ఇండోసీన్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, ఐడీపీఎల్ మెయిన్ రోడ్డు, సీఐఈ గాంధీనగర్, ఈనాడు కాంప్లెక్స్, గిరినగర్, గురుమూర్తి నగర్ తదితర ప్రాంతాలు. హెచ్‌ఏఎల్ సబ్‌స్టేషన్ సౌభాగ్యనగర్ ఫీడర్ పరిధిలోని శ్రీరామ ఇండస్ట్రీస్, ఉషా కంపెనీ, డ్యులక్స్ పెయింట్ ఇండస్ట్రీస్, డీ మార్ట్, ఇంద్ర గాంధీనగర్, సుమిత్రనగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

11కేవీ మీనాక్షి ఫీడర్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: ఫీడర్ లైన్ల క్యాపిటల్ వర్క్స్ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేట్‌బషీరాబాద్ సెక్షన్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మీనాక్షి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు మీనాక్షి ఎస్టేట్స్, స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ, అంగడిపేట్, గాయత్రీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 2.30 గంటల వరకు గాయత్రీనగర్, గోదావరి హోమ్స్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

నేడు శాంతియుత నిరసన

నిజాంపేట్: పారిశ్రామిక కాలుష్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న శాంతియుత నిరసన చేపట్టనున్నట్లు మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మీ సుబ్బారావు తెలిపారు. ఉదయం 11 గంటలకు పీసీబీ ఆఫీస్, శాంతనగర్, ఎర్రగడ్డ ప్రాంతంలో నిరసన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమల కాలుష్యాన్ని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పంపించాలని కోరారు

చెరువులో మట్టి డంప్ చేస్తున్న టిప్పర్ సీజ్

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా మట్టి డంపింగ్ చేస్తున్న ఓ టిప్పర్‌పై హైడ్రా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిఘా పెట్టిన పోలీసులకు గురువారం రాత్రి డంపింగ్ విషయమై అందిన సమాచారం మేరకు దాడులు చేసి టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా మట్టి పోస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక పూజలు..అన్నదానం


అన్నదానంలో భక్తులు

జగద్గిరిగుట్ట: పౌర్ణమిని పురస్కరించుకుని మగ్దుమ్‌నగర్, పాలాలబస్తీలో గల మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం అభిషేకం, అర్చన, అలంకరణ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం చేపట్టిన అన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలోపాల్గొన్నారు.

దాబా నిర్వాహకుడిపై కేసు

కుత్బుల్లాపూర్: దాబాలో అనుమతుల్లేకుండా మద్యం విక్రయించగా పేట్ బషీరాబాద్ పోలీసులు తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేశారు. కొంపల్లి సమీపంలోని గుల్ల పోచంపల్లి వద్ద ఉన్న బైసాకి దాబాలో అనుమతుల్లేకుండా మద్యం సేవిస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి పరిశీలించి దాబా ఓనర్ జగన్మోహన్ రెడ్డి పై కేసు నమోదు చేసి బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


ప్రకాశ్‌సాహు (ఫైల్)

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ప్రకాశ్ సాహు (26) మూడేళ్ల క్రితం నగరానికి వలసవచ్చి లేబర్‌గా పనిచేస్తున్నాడు. కాగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న ప్రకాశ్‌సాహును కొంపల్లి సమీపంలోని బైసాకి దాబా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోలీ..రంగుల కేళి

నియోజకవర్గవ్యాప్తంగా అంబరాన్నంటిన వేడుకలు

చిన్నా..పెద్దా తేడా లేకుండా సంబరాలు

నియోజకవర్గవ్యాప్తంగా శుక్రవారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచే చిన్నా..పెద్దా తేడా లేకుండా ప్రతిఒక్కరూ రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. దీంతో అపార్ట్‌మెంట్లు, కాలనీలు, బస్తీల్లోని వీధులన్నీ రంగులమయంగా మారాయి. – కుత్బుల్లాపూర్ జోన్ బృందం


హోలీ ఆడుతూ సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు


సుభాష్‌నగర్ డివిజన్‌లో కాలనీవాసులు..


వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో..


వేడుకల్లో సుభాష్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ హేమలత..


జీడిమెట్ల డివిజన్ ఉడ్స్ కాలనీలో..


గాజులరామారంలో..




చిన్నారితో హోలీ ఆడుతూ..


సంజయ్‌గాంధీనగర్‌లో అసోసియేషన్ సభ్యులు..


జగద్గిరిగుట్ట సోమయ్యనగర్‌లో..


పైపులైన్ రోడ్డు లక్ష్మీగంగా ఎన్‌క్లేవ్‌లో..


పద్మానగర్ గాయత్రీ అపార్ట్‌మెంట్‌లో..


మైసమ్మనగర్-బీ బ్లాక్‌లో యువత..


బతుకమ్మబండ బస్తీలో..


ఆదిత్య గార్డెన్‌లో చిన్నారులు..


రంగులు పూసుకుంటున్న చిన్నారులు

మాజీ మంత్రి సస్పెన్షన్‌పై బీఆర్ఎస్ ఆందోళన


రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ శ్రేణులు

కుత్బుల్లాపూర్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం ఆందోళనకు దిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టినందుకే జగదీశ్ రెడ్డిని కుట్రపూరితంగా సస్పెన్షన్ చేశారని, రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలకు కాంగ్రెస్ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందని ఆరోపించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి నాయకులను అదుపులోకి తీసుకుని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, రంగారెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్వ శంకరయ్య, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్‌యాదవ్, జగద్గిరిగుట్ట వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణుయాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, సంపత్ మాధవరెడ్డి, గుమ్మడి మధుసూదన్ రాజు, డాక్టర్ హుస్సేన్, కమలాకర్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ చేసిన వ్యక్తి అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన వ్యక్తిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఉప్పు సాయితేజ (26) హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో ఉంటూ ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వచ్చిన జీతం జల్సాలకు సరిపోకపోవడంతో చోరీల బాట పట్టాడు. ఇదే క్రమంలో టెంపుల్ బస్టాప్ ఎదుట ఉన్న ఈడబ్ల్యూఎస్ గృహాల్లో ఉంటున్న అంజలి గత బుధవారం ఉదయం ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా ఆమె వద్దగా వెళ్లిన సాయితేజ సెల్‌ఫోన్లో ఉన్న వివరాలు చూపుతూ అడ్రస్ అడిగాడు. తన వద్ద ఉన్న వాటర్ బాటిల్ ఇచ్చి నీళ్లు కావాలని అడిగాడు. దీంతో వాటర్ తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్లిన అంజలి వెనుకాలే వెళ్లిన సాయితేజ ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. దీంతో నిందితుడి నుంచి తులం బంగారం గొలుసు, సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. తక్కువ సమయంలోనే నిందితుడిని పట్టుకుని సొత్తును స్వాధీనం చేసుకోవడంలో పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించి రివార్డు అందజేశారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: గేటెడ్ కమ్యూనిటీ ప్రాంతాలను అడ్డాగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులతో పాటు మరో నలుగురు కొనుగోలుదారులను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి శుక్రవారం వివరాలు వెల్లడించారు. గురువారం సాయంత్రం కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లోని ఇందూ ఫారుచ్యూన్ ఫీల్డ్స్ అపార్టుమెంట్ వద్ద ఖాళీ స్థలంలో గంజాయి అమ్ముతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఉన్నతాధికారుల అనుమతి మేరకు ఎస్ఐ మౌనిక రెడ్డి, సిబ్బంది, క్లూస్ టీంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని తుమ్మల ఆశిష్ కుమార్ (29), కట్టింపూడి సాత్విక్ (20)ను అదుపులోకి తీసుకుని వారి జ్యూట్ బ్యాగ్‌ను పరిశీలించగా గాజు పాత్రలో భద్రపర్చిన కుష్ గంజాయిని, డబ్బాలో ఉంచిన 7500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ముంబైకి చెందిన ఆశిష్‌కుమార్‌ను విచారించగా తనకు గంజాయి సేవించే అలవాటు ఉందని, గతే ఏడాదిగా ముంబైలో కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఇదే కేసులో ఒకసారి పట్టుబడి బెయిల్‌పై బయటకు వచ్చాడు. మళ్లీ అదే బాటలో నడుస్తున్నాడు. ఈనెల 10న తన స్నేహితుడు సాత్విక్‌ను ముంబైకి పంపించి 260 గ్రాముల కుష్ గంజాయి, 1100 గ్రాముల గంజాయి తీసుకుని ఆశిష్‌కు ఇచ్చాడు. దాన్ని చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి గురువారం తెలిసిన కొంతమంది యువకులకు అమ్మేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆశిష్, సాత్విక్‌ను పట్టుకోగా గంజాయి కొనేందుకు వచ్చిన నలుగురు యువకులను పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 260 గ్రాముల కుష్ గంజాయి, 1100 గ్రాముల గంజాయి, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాడు 66.. నేడు 6 ఫీట్లు..!

- యథేచ్ఛగా ఫాక్స్‌సాగర్ ప్రధాన నాలా కబ్జా
- పూడ్చివేసి అక్రమ నిర్మాణాలు
- దీనిద్వారానే 3 చెరువులకు నీళ్లు
- గతంలోనే హైకోర్టును ఆశ్రయించిన స్థానికుడు
- సదరు నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని ఆదేశం
- మిగిలిన గడువు 4 రోజులే


సర్వేనం.120 వద్ద నిర్మాణం..

సుభాష్‌నగర్: భవిష్యత్ తరాలకు ఉపయోగపడాల్సిన చెరువులు కొందరి స్వార్థ ప్రయోజనలతో కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. చెరువుల్లోకి వర్షపు నీరు రావాలంటే కాలువలే ప్రధానం. అయితే వాటిని సైతం కొందరు అక్రమార్కులు వదలకపోవడంతో భవిష్యత్తులో చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు రాక అవి ఎండిపోయే దుస్థితికి చేరుకునే ప్రమాదముంది. దీనికి దూలపల్లిలోని ప్రధాన రహదారి నుంచి ఫాక్స్ సాగర్ వరకు వెళ్లే 66 ఫీట్ల నాలా కబ్జాకు గురి కావడమే నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

66 ఫీట్లతో 1.5 కిలోమీటర్ పొడవు..

కొంపల్లి మున్సిపల్ దూలపల్లి ప్రధాన రోడ్డు సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఫాక్స్ సాగర్‌వరకు 66 ఫీట్ల వెడల్పుతో 1.5 కిలోమీటర్ మేర పొడవుతో కట్టు కాలువ విస్తరించి ఉంది. కట్టు కాలువ మధ్య నుంచి ఇరువైపులా కొంపల్లి, దూలపల్లి పరిధిలోకి వస్తాయి. చుట్టూ భవనాలు, విల్లాలు ఉండడంతో కొంతమంది కళ్లు దీనిపై పడ్డాయి. కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా నాలాను ఇరువైపులా పుడుస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. సర్వే నంబర్ 151 వద్ద ఓ వ్యక్తి నాలాను పూడ్చివేయడంతో 66 ఫీట్ల నాలా కాస్తా 6 ఫీట్లకే పరిమితమైంది. ఈ విషయమై 24 ఆగస్టు 2022న ఓ స్థానికుడు హైకోర్టును ఆశ్రయించారు.

3 చెరువుల వరద నీరు ఈ నాలాగుండానే..

ఎగువ ప్రాంతమైన మైసమ్మగూడ, గుండ్ల పోచంపల్లి, దూలపల్లిలలోని గుండ్ల చెరువు, తమార్ చెరువు, లింగయ్య చెరువులోకి వరద నీరు ఈ నాలా గుండానే వెళ్లి ఫాక్స్ సాగర్‌లో కలుస్తాయి. 2016, 2023, 2024 లో భారీ వర్షం పడినప్పుడు ఉధృతంగా ప్రవహించి కొంపల్లి దూలపల్లి ప్రధాన రోడ్డుపై నుంచి వరద పోటెత్తడంతో అధికారులు 3 రోజుల పాటు వాహనాలను వేరే దారి గుండా మళ్లించారు అంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

నాలాలోనే రోడ్డు..

66 ఫీట్ల వెడల్పుతో ఉన్న నాలాను కొంతమంది పూడ్చివేసి నిర్మాణాలు చేపట్టారు. దూలపల్లి, కొంపల్లి ప్రధాన రోడ్డు నుంచి నాలాలో మట్టి పోసి రోడ్డును వేసుకున్నారు.

ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం..

ఈ విషయమై ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకునేందుకు వెనుకడుగు వేశారు. దీంతో ఓ స్థానికుడు 24 ఆగస్టు 2022న హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఇరిగేషన్, రెవెన్యూ సంయుక్తంగా కలిసి నాలా కబ్జాపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇది ముమ్మాటికి ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టారని ఇరిగేషన్ శాఖ అధికారులు మున్సిపల్ అధికారులతో తేల్చి చెప్పారు. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదు. తాజాగా ప్రభుత్వం నియమించిన హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందన లేదు. దీంతో డిసెంబర్ 2024 న రీట్ పిటిషన్ వేయగా జనవరి 21న హైకోర్టు స్పందిస్తూ రెవెన్యూ, ఇరిగేషన్, హైడ్రా, మున్సిపల్ అధికారులు 8 వారాల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో అధికారులకు గడువు మరో 4 రోజుల మాత్రమే ఉంది. అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో లేదా వారికే వత్తాసు పలుకుతారో వేచి చూడాల్సిందే.


సర్వే నం.151 వద్ద నాలా పూడ్చివేసి చేపట్టిన నిర్మాణం


సర్వే నం. 151 వద్ద 6 ఫీట్లకే పరిమితమైన నాలా

నాలాను పరిశీలిస్తా..



ఇటీవలే కొంపల్లి మున్సిపాలిటీకి వచ్చాను. నాలాలో నిర్మాణాలు చేపట్టిన వారికి కోర్టు జారీ చేసిన ఆదేశాలు తనకు తెలియదు. కోర్టు నోటీసులను పరిశీలించి, హైడ్రా అధికారులకు నివేదిక పంపిస్తా.

– కృష్ణారెడ్డి, కొంపల్లి మున్సిపల్ కమిషనర్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029